వెండిది చేయించాలంటే రెండు కేజీల వెండి కావాలి. అయినా రాత్రికి రాత్రి ఎలా చేస్తారు?" అన్నాను. చిన్నది చేయిందు. మనం భోజనాలు దగ్గర పెట్టుకునే కూర బేసిన్ సైజుది చాలు" అన్నాడు. "అదైనా 750 గ్రాముల వెండి కావలిసొస్తుంది. ఈ డబ్బంతా ఎవరు పెట్టుకుంటారు?" అన్నాను. "తప్పదు, మినిస్టరుగారు శంకుస్థాపన చేసే సమయంలో ఈ బేసిన్ ఎడం చేత్తో పుచ్చుకుని, కుడి చేత్తో తాపీ పట్టుకుని-" అంటూ సోదాహరణ ఆంగిక ప్రసంగంచేసి కొండలరావు కొండంత సమస్య తెచ్చిపెట్టాడు. మా సంభాషణ అంతా ఇంట్లో జరగడం వల్ల అది మా అమ్మ వినడం, ఒక పాతకాలం నాటి ఇత్తడి పళ్లెం తెచ్చి దీనికి వెండి మలామా వేయించి పని కానిమ్మని సూచించడం అయింది. కొండని తవ్వి ఎలకని పట్టినట్టయినా రాజీకొచ్చేం.

మర్నాడు ఫంక్షన్ అయిపోగానే సైట్‌లోనే వెండితాపీ ఇత్తడి, వెండి మలామా- పళ్లెం కడిగించి ఒక సంచిలో పెట్టి మినిస్టర్ గారి వెంట వచ్చిన ఆత్మీయుడికి వప్పగించేడు కొండలరావు. "అదేమిటి?" అన్నాను. "అదంతే. అవి రెండూ మినిస్టర్ గారికి చెందుతాయి" అన్నాడు. "అయ్యో, ఆ పళ్లెం మా అమ్మ పెళ్లినాటిదోయి. ఏదో వెండి మలామా చేయిస్తే మరో పది కాలాలపాటు ఉంటుందని ఆవిడ ఆశపడి ఇచ్చింది పాపం;" అన్నాను. "ఎట్టి పరిస్థితుల్లోనూ అది వెనక్కిరాదు" అన్నాడు కొండలరావు. "గోడకి పూసిన సున్నం వేశ్యకి పోసిన వెల -" అన్లేదు.

ఆ రాత్రి మినిస్టరు గారూ మా ఆఫీసర్ గారూ మిగిలిన వి.ఐ.పి.లూ ఎక్కడో పోష్ హోటలుకి డిన్నరు కెళితే కొండలరావుని మా ఇంటికి తీసికెళ్లేను. "ఈ పళ్లెం నా దగ్గిర తప్ప ఎక్కడున్నా వాళ్లకి కష్టాలు తెస్తుంది బాబూ. దానికి మంత్రం వేసి వుంది." అంది మా అమ్మ. "పోతే పోనివ్వండి" అన్నాడు కొండలరావు.

సరిగ్గా ఆరు రోజుల తరవాత కొండలరావు హైదరాబాదు నుంచి పనిగట్టుకుని వచ్చి ఆ పళ్లెం తెచ్చి ఇచ్చీసేడు. "మినిస్టర్ గారికి ఉద్వాసన చెప్పేరు, తెలుసుకదా? నాకు రివర్షన్ రాకుండా చూసుకోవాలి. అందుకు" అన్నాడు. ★

# 55. కిటికీ పక్కసీటు

**మొ**న్నీమధ్య ఓనాడు నేను బెజవాడ నించి బందరుకి బస్సులో వెళ్లవలసి వచ్చింది.

"ఉంకో గంటవరకూ నాన్‌స్టాప్ బస్సులేదు; ఆడ్నరీ బస్‌లో ఎళిపోండి" అన్నారు డిపో అధికారి ఒకరు. టిక్కెట్లు మాత్రం ముందుగానే తీసుకోమన్నారు. సరేకదా అని లైను కాసి టిక్కెట్టు తీసుకుని, దాని వెనకాల రాసిన నెంబరుగల బస్సుని వెతుక్కుని లోపల ప్రవేశించేను. నాకన్నా ముందుగా కొందరు బస్సులో ఎక్కి కూర్చున్నా; సీట్లలో వేసిన రుమాళ్లూ, తుండు గుడ్డలూ, చేతి సంచీలు లెక్కపెడితే బస్సులో కూర్చున్న మనుషుల సంఖ్య కంటె వీటి సంఖ్య ఎక్కువగా తేలింది; నాకు ఎక్కడ కూర్చుందామన్నా ఏదో ఒక అడ్డు ఉన్నట్టే తేలింది. చివరికి ఒకచోట వాదిగి కూర్చున్నాను. నేను కూర్చున్న ఒక నిమిషానికి ఒక యువకుడు నా వరసలోనే కుడివేపున్న మూడు సీట్ల బెంచీలో కిటికీ పక్కసీట్లో స్థిరపడి అక్కడున్న చేతి సంచీతీసి ఇటువేపు పెట్టాడు. మరో రెండు నిమిషాలకి ఇంకో యువకుడు వచ్చి ఇతనితో "లెగు." అన్నాడు.

"ఎందుకు లెగాల?"

"అక్కడ నా ఏండ్ బేగెట్టాగా."

"ఏండ్ బేగా నా తలకాయా? చేతి సంచీ ఎట్టుంటావు. ఇదేగా!"

"అదేగాని, లెగు. చేతిసంచీ అంటే ఏండ్ బాగ్ కాదెట్టా?"

"మనమొగాలకి ఏండ్ బేగోటీ తక్కువొచ్చింది! సిమ్మింటు గోతాం కత్తిరించి కుట్టుకున్నాది ఏండ్ బేగెట్టాయిద్ది? దీన్ని చేతి సంచంటే నీకు పరువు తక్కువొచ్చిందేం?"

"సీట్లోంచి లెగమంటే ఏండ్ బేగూ, చేత్సంచీ అంటా వోదన బెడతావేంది; లెగు లెగు. నేనా సీటు రిజర్వేసన్ జేస్కున్నా."

"రిజర్వేసన్ జేస్కోటాకి ఇదేమన్నా గోదారెస్ప్రెస్సా? రిజర్వేసన్ జేశాడంట!" అని మొదటొచ్చిన యువకుడు కిటికీ వేపు తిరిగిపోయాడు. కాంప్రడించి ఉమ్మినట్టు చప్పుడు చేసేడు. డైరెక్టుగా ఇతనితో మాట్లాడకుండా తనలో తానే గొణుక్కుంటున్నట్టు రిజర్వేషన్ల గురించి ఏదేదో అన్నాడు. అదంతా..... దగ్గిరగా ఉన్న అతనికే కాదు; కొంచెం దూరంగా ఉన్న నాకు కూడా వినిపించింది. అయితే ఆ మాటలు వివరంగా రాస్తే (ప్రచురిస్తే) గొడవలైపోతాయి; అంచేత రాయను.

కిటికీ పక్కసీటు కోసం ఆశించడం, ఆరాట పడడం రిజర్వేషన్ చేసుకోడం బెజవాడనించి బందరు వెళ్లే 'ఆడ్నరీ ఆర్టీసీ' బస్సుకి మాత్రమే పరిమితం కాదు. పాసింజెరు రైళ్లలోనూ, సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లాంటి (రిజర్వేషన్లు, స్పీడు, హుందా, సమయ నియమంలేని) చిల్లరమల్లర ఎక్స్‌ప్రెస్ రైళ్లలోనూ, కార్లలోనూ, జీపుల్లోనూ, ఆఖరికి విమానాల్లోనూ కూడా విస్తరించి వుంది. గోదావరి, కోణార్క్, కోరమాండల్ లాంటి నిజమైన ఎక్స్‌ప్రెస్ రైళ్లలోనూ, నాన్‌స్టాప్ ఆర్టీసీ బస్సుల్లోనూ సీట్ల నెంబర్లు టిక్కెట్ల మీదనే వేస్తారు కాబట్టి అది దైవనిర్ణయంగా భావించి కిటికీ పక్కని సీట్లు రానివాళ్లు "మన ఖర్మం ఇంతే; ఇన్నివందల మైళ్లూ ఇలా మధ్య సీట్లో నొక్కుకు పోతూనూ, ఇవతలి చివర్న తూగిపోతూనూ కూర్చోవలిసిందే!" అని కాంప్రమైజ్ అయిపోక తప్పదు.

బియ్యం రామారావని, నేను ఉద్యోగం చేస్తున్న రోజుల్లో నా సహాధ్యాయి. (బి.ఎం. రామారావు - అనే, అతని పేరు. తొందరగా ఉచ్చరించడంలో ఎవరో బియ్యం రామారావని అనేస్తే ఆ తరవాత అందరూ అతనికి ఆపేరు వాడుక చేసేరు.) అతనూ. నేనూ. మరి కొంతమంది ఉద్యోగులూ అప్పుడప్పుడు ఆఫీసు పనిమీద "స్టాఫ్‌కార్" లో ఎక్కడికైనా వెళ్లవలిసొస్తే కారు వెనక తలుపు తెరిచిపట్టుకుని "ఊఁ; ఎక్కండి!" అని అడావిడి చేసి ఆ మర్యాద మాయలోపడి ఇద్దరు ఎక్కి కూర్చున్నాక అతను చక్కగా కిటికీ పక్కనుండే సీట్‌లో అమిరిపోయేవాడు. ఒకసారి అతనికన్నా "బేసిక్ పే" ఎక్కువ ఉన్న ఒకాయన తగిలి, రామారావుని మధ్యసీట్లోకి తోసేసి తను కిటికీ పక్క సీటులో చేరేసరికి రామారావు చాలా ఇదైపోయాడు. మొదటి మజిలీలో అందరం దిగి అక్కడ పని చూసుకున్నాక మళ్లీ అందరం కార్లో సర్దుకునేటప్పుడు రామారావు వెనక వరసలో తనకొచ్చే మధ్యసీట్లో కెళ్లకుండా ముందువరసలో డ్రయివరు పక్కనుండే

మధ్యసీటులోకి మారిపోయేడు. "రామారావూ; కార్లో వెళ్లేటప్పుడు బేక్‌సీట్లోనూ, జీపులో వెళ్లినపుడు ఫ్రంట్ సీట్లోనూ కూర్చుంటే మన శ్టాటస్సు బాగుంటుందయ్యా." అని ఎవరో అతన్ని వేళాకోళం ఆడేరు.

ఓసారి హైదరాబాదు నించి విశాఖపట్నం రావడానికి నాకు విమాన ప్రయాణ యోగం పట్టింది. (టిక్కెట్టు ఎవరో "ఎరేంజి" చేసేరని వేరే చెప్పక్కర్లేదు కదా!) ఆ సందర్భంగా నాకు పట్టిన మరో అదృష్టం ఏమిటంటేనూ, నా టిక్కెట్టు మీద వేసిన నెంబరు ప్రకారం నాకు కిటికీ పక్కని సీటు వచ్చింది. బస్సుల్లోనూ, రైళ్లలోనూ, కిటికీ  పక్కని కూచుని ప్రయాణం చేస్తే ప్రకృతి దృశ్యాలు చూడొచ్చు. వెనక్కి పారిపోతున్న చెట్లనీ, టెలిఫోన్ స్థంభాలనీ, రైల్వే భూమేకదా అని నేలను అపవిత్రంచేసే మనుషుల్నీ చూసి నవ్వుకోవచ్చు; విసుక్కోవచ్చు. ఫ్రెష్ ఏర్ - అనగా పరిశుభ్రమైన గాలి పీల్చవచ్చు. పక్కసీట్లోవాడు వెళ్లబోసుకునే గోడు వినడానికి విముఖత చూపిస్తూ తల ఇటువేపు తిప్పేసుకుని సమయానుకూలంగా ఉమ్మేసీ తుమ్మేసీ నిరసన వ్యక్తపరచవచ్చు. కాని విమానంలో వెళ్లేటప్పుడు కిటికీ పక్కని కూచుంటే ఇన్నిరకాల సుఖాలు ఉండవు. కొండలంతేసి పెద్దపెద్ద పదార్థాలు వెనక్కి పారిపోతుంటే చూద్దామన్నా, గోదావరి నది పిల్లకాలవలా కనిపిస్తే చూడాలన్నా, భద్రాచలం సీతారామస్వామి ఆలయం హైదరాబాదులో హిందూ అమ్మవారి గుడి సైజుకి తగ్గడం గమనిద్దామన్నా - తలా మెడా వంచుకుని తంటాలు పడాలే తప్ప బైటికి చాచడానికి వీలుండదు; అందుకే; నా పక్కని కూర్చున్న పరాయి దేశస్థుడు " ఎక్సూజ్ మీ-" అని మొదలెట్టగానే సూక్ష్మగ్రాహినై కిటికీ పక్క సీటుని త్యాగం చెయ్యగలిగాను!

ఆర్డనరీ బస్సుల్లోనూ, పరువు తక్కువ రైళ్లలోనూ కిటికీ పక్కని సీటు దొరికినా కూడా త్యాగాలు చేసే సందర్భాలు కొన్ని లేకపోలేదు. ఎండగానీ, వానగానీ వస్తే కిటికీ పక్క సీటువాడు ఈ సీటు ఎలా వదిలించుకోవాలిరా దేముడా అని -జ్వరం, జలుబూ లాంటి సాకుల్లో పడతారు.

కిందటి సంవత్సరం సెప్టెంబర్‌లో నేను విశాఖపట్నం నించి హైదరాబాదు వెళ్లినపుడు ఓ తమాషా జరిగింది. నేను కూర్చున్న (కిటికీ  పక్క) సీటుకి ఎదురుగా కాషాయ వస్త్రాలు ధరించిన (గెడ్డము, మరియు మీసము, మరియు జడలు పెంచిన) ఒక నడివయస్సు వ్యక్తి కూర్చున్నాడు. రైలు (గోదావరి ఎక్స్‌ప్రెస్సే) విశాఖపట్నం వదిలిన వెంటనే ఆస్వామి పక్కనున్న పెద్దమనిషి కిటికీకి షట్టరు దింపెయ్యమని అడిగాడు. "ఎండ చాలా తీవ్రంగా ఉంది, చూసేరు కదా!" అని నవ్వుతూ కూడా అడిగాడు. అప్పుడా స్వామి తను కూడా నవ్వుతూ "మీరు కొద్దిగా అటు జరిగి కూర్చోండి. ఎండ తీవ్రంగా ఉన్నమాట నిజమే గాని ముందు నాకు కదా, తగుల్తున్నది! నేను భరించగలుగుతున్నాను" అని చెప్పేరు.

యలమంచిలి దాటేక వర్షం తగిలింది. "షట్టర్ దించేయండి బాబూ" అని స్వామి పక్కాయన మళ్లీ అడిగాడు. అప్పుడు స్వామి అతనొక్కడే కాక; మా కాబిన్‌లో ఉన్న అందరినీ వినమని చిన్న ఉపన్యాసం చేసేరు.

"దేవుడు మనుషుల్ని సృజించేటప్పుడు - అనగా యుగయుగాల నాడు - మనమీద గొప్ప నమ్మకంతో ఆ సృష్టి చేశాడు. ఈ జీవి నా సృష్టిలో కెల్లా ఉత్తమమైనది, ఈ జీవి ఎండకు ఎండినా, వానకు తడిసినా, చలికి ముడుచుకున్నా అన్నిటినీ భరించగలడు - అనే

నమ్మకంతో మనిషిని దేవుడు సృజించాడు. కాని, మనం చేస్తున్నదేమిటి? ఎండకి ఏసీలు పెట్టుకున్నాం. చలికి రగ్గులూ, రూమ్ హీటర్లు వాడుతున్నాం. వానకి గొడుగులూ, రెయిన్ కోట్లూ వాడుతున్నాం. స్వార్థంతో, స్వసుఖాపేక్షతో సాటి ప్రాణుల్ని హతమారుస్తూ ప్రకృతి శక్తుల్ని ప్రతిఘటిస్తూ సృష్టికర్తనే అవమానిస్తున్నాం! తగినంత ఎండా, వానా, చలీ దేహానికి తగలని మానవులు అనారోగ్యంలో పడిపోతున్నారు. ఇంతకీ ఎండగాని, వాన గాని ముందు తగుల్తున్నది నాకే కదా!"

వెనకటికి తెలుగు సమంగా ఉచ్చరించలేని ఒకానొక అన్య భాషీయుడిని; "అయ్యో, ఇలా చిక్కిపోతున్నావేమిటి!" అని ఒక తెలుగువాడు పరామర్శిస్తే "అరె; చిక్కీపోతామ్; సచ్చీ పోతామ్ బే; నీ కెందుక్కా!" అన్నాడట - అని స్వామి బాత్‌రూం కెళ్లినప్పుడొకరు కామెంట్ పాస్ చేసేరు.

1964లో నేను హైదరాబాద్‌లో ఉద్యోగంలో ఉండగా ఒక విశాఖమిత్రుడు (హై)కోర్టు పనిమీద వచ్చాడు. ఇప్పట్లా అప్పుడు బెర్తు రిజర్వేషన్లు లేవు. బాగా ముందుగా వచ్చి, సామాన్లు పెట్టుకునే పై బెంచీమీద తువ్వాలు పరుచుకుంటే అదే పడకగా ఖాయం అయ్యేది. ఈ మిత్రుడు కొంచెం లేటుగా ఒచ్చేసరికి తువ్వాలు పరిచే ఖాళీలన్నీ భర్తీ అయిపోయాయి. "ఏం చేస్తారు మరి; ఏదో కార్నర్ సీటు చూసుకుని కూర్చోండి" అన్నాను.

"అయ్యబాబోయి, అలా మాత్రం దీవించకండి" అన్నాడా మిత్రుడు; రావిశాస్త్రి గారి కథ గుర్తొచ్చి కాబోలు,

★

# 56. బాషా హుషార్

**బా**షా అని; వెనక నేను హైదరాబాదు టవున్ సర్వేలో పని చేస్తూ వుండినప్పుడు ఇంకో రేంజిలో సర్వేయరుగా ఉండేవాడు. నేను తిరువూరు నుంచి హైదరాబాదుకి ట్రాన్స్‌ఫరై రాకముందు నుంచీ అతను హైదరాబాదులో పనిచేస్తున్నాడని తెలిసినా, అన్ని రేంజిల వాళ్లమూ ఒకసారి ఎక్కడా కలుసుకొనే అవకాశం ఉండకపోడాన్నించి అతను కొంత కాలం నాకు పరిచయం అవలేదు. ఐతే నేను జాయినైన రెండు నెలలకి అతను నా రేంజిలోకి ట్రాన్స్‌ఫరై వచ్చాడు. మా అసిస్టెంటు డైరెక్టరు గారు స్వయంగా అతన్ని నాకు పరిచయం చేసేరు. "యూసుఫ్ గుడాలో కాపరం. పెళ్లి చేసుకోలేదు. తల్లీ తండ్రీ ఉన్నారు. వాళ్లకి అన్నీ అమర్చి పెట్టి మరీ డ్యూటీకి రావాలి ఇతను. అందుకని దిల్‌సుఖ్‌నగర్ రేంజి నుండి నీ రేంజికి మార్చేను. ఇతనికి బాహ్‌లూల్ ఖాన్ గుడాలో వర్కు ఇయ్యి" అని చెప్పేరు.

"ఉద్యోగికి దూరభూమి లేదని నీతిచంద్రికలో చెప్పేరు. నీతిచంద్రిక ప్రకారం, సుమతీ శతకం ప్రకారం అన్నీ చేస్తున్నామా అంటే; చెయ్యగలిగినంత మేరకి చెయ్యాలికదా! మాది విజయనగరం. ఆ ఊళ్లో ఒక సర్వే పార్టీ ఉంది. ఆ ఏరియాలో నా కేటగిరీవి పదహారు పోస్టులున్నాయి. అయినాసరే హైదరాబాదు వెయ్యగానే నోరు మెదపకుండా నేనొచ్చేనా లేదా? అందరికీ పొయ్యిపక్కనే ఆకుమడి కావాలంటే అమరుతుందా? ముందు హైదరాబాదు జిల్లాకి